సుందరభారతయాత్ర

సాధన గ్రంథమండలి, తెనాలి

సుందరభారతయాత్ర

ప్రథమ భాగము

సాధన గ్రంథ మండలి, ౫౮.

సుందర భారతయాత్ర

(ప్రథమ భాగము)

గ్రంథకర్త:

బులుసు సూర్యప్రకాశశాస్త్రి

విద్వాన్.

ప్రకాశకులు

సాధన గ్రంథమండలి - తెనాలి.

 [వెల: రు. 2-8-0

మన్మథ ♦ శ్రావణము

ప్రతులకు :—

వేంకట్రామ అండ్ కో, వారి అన్ని బ్రాంచీలు.

ఓరియంట్ పబ్లిషింగ్ కంపెనీ వారి అన్ని బ్రాంచీలు.

ప్రభాత్ బైండింగు వర్క్సు, తెనాలి.

జానకిరాం ప్రెస్, తెనాలి.

ACKNOWLEDGMENT

The author is very happy to express his grateful thanks for the help he has received, from the various Ministries of the Government of India, such as Ministry of Information and Broadcasting, Ministry of Transport; Press Information Bureau, Regional Touriest Officer, Madras, Public Relations Officers of various Railways and Directors of Information and Publicity of various State Governments, who have very readily and willingly placed the Choicest Photographic material and other valuable information for use by the author, and this indeed is a clean indication of the value and esteem with which they look upon such efforts as the publication of this book. He further wants to make a special mention of the help he has received from the Executive Officers of various famous temples and to Sri C. Sitaram, Manager, Poorna Pictures, Madras, for the pictorial illustrations lent to adorn this touriest guide, the first of its kind published in Telugu. Author's thanks are also due to the literary giants of Modern Telugu, who have very generously made several good contributions, in the shape of preface etc., which have indeed enhanced the value of this book and also to the State

Governments of Madras, Assam, United Provinces, Orissa, East Punjab, West Bengal, Bombay, Kashmir, Mysore, Rajasthan, Sowrastram, Hyderabad, Ajmir, Kutch, Coorg, Bhopal, Vindhyapradesh & Delhi Etc.

He also wants to express his heart felt gratitude to his valued friend Sri V. Bhanumurty, B. A., (Secretary, Science Society, Madras – 4, and Assistant Information Officer, Press Information Bureau, Govt. of India.) for the spontaneous and keen interest he has evinced in enabling this book rich in information and illustrations, to be brought out in this present form.


B. SURYAPRAKASA SASTRY

AUTHOR.



శ్రీ శివాయ గురవేనమః

అంకితము



'అనాయాసేన మరణం వినా దైన్యేన జీవనమ్,
దేహాన్తే తవ సాయుజ్యం దేహి మే పార్వతీపతే!'

శ్రీ విశ్వేశ్వరుని పాదపద్మములందు
నమస్కారములతో సమర్పితము.

స్వవిషయము

సాధన గ్రంథ మండలికి ఎనిమిది సంవత్సరములు నిండి తొమ్మిదవసంవత్సరము నడచుచున్నది. కాని అనివార్యమగు కారణములచే నీ వత్సర మింతవరకు గ్రంథ ప్రకటనము జరుగ లేదు. నేడు ఈ సుందరభారతయాత్ర గ్రంథము వెలువడు చున్నది. ప్రధానమగు ఆర్థిక సమస్య నానాటికి తీరని సమస్యగా పరిణమించుచున్నది.

సాధక పాఠక లోకమువలన తగినంత ప్రోత్సాహ సహాయ ములు కలుగుటలేదు. ఇతరుల మనస్సును కష్టపెట్టి గ్రంథ ప్రచు రణ చేయుట మండలి యాశయముకాదు. 4, 5 సంవత్సరముల పారితోషక మివ్వవలసినవారు కలరు. ఎన్నివిధముల నివేదించి నను, వారివలన సమాధానములేదు. ఏ కారణముచేనైనను సభ్యు లుగా నుండుట కవకాశములేకున్న, ఆ సంగతి తెలిపిన మండలికి మహోపకారము. మీయందలి విశ్వాసముచే గ్రంథములు పంపుచునే యుంటిమి. విజ్ఞులకు ఇంతకన్న తెలుపవలసినపనిలేదు. తామివ్వవలసిన సభ్యత్వ పారితోషికమును వెంటనేపంపి, మా కృషిని ప్రోత్సహింపుడు. సభ్యులుగా నుండుట కిష్టములేనిచో ఆ విషయము తెలిపిన మహోపకారము చేసినవారగుదురు. యథాప్రకారము తమ సభ్యత్వ పారితోషికమును పంపి, మా యీ కృషిని ప్రోత్సహించు సభ్యులకు మా కృతజ్ఞతలు.

వ్యవస్థాపకుడు?

సాధన గ్రంథమండలి

యాత్రా సూచన

భారతదేశమంతయు పర్యటించుటకు, అధమము ఒక సంవత్సరము పట్టును. ఇంతకాలము ఆరోగ్యముగా నుండుట కష్టసాధ్యము. గాన రెండు మూడు తడవులుగా భారతదేశ సౌందర్యము గాంచుట యుక్తము. ఈ క్రిందివిధముగ యాత్రా క్రమము వారివారి యిష్టానుసారము పర్యటన చేయవలయును. బదరీ, కేదారయాత్రలలో ఆరోగ్యమును కాపాడుకొనుట చాల యవసరము. ప్రస్తుతము బదరీ పోవుట చాల సుకరము. పీపల్ కోటి వరకు బస్సుమార్గము వేయబడెను.

౧. బెజవాడ, కన్యాకుమారి, బొంబాయి, ద్వారక, హరిద్వారం, కాశ్మీరు, బదరీ, కాశి, గయ, నేపాల్, కలకత్తా, పూరి, రామేశ్వరం, బెజవాడ — ఇది సంపూర్ణ భారతయాత్ర.

౨. బెజవాడ, కన్యాకుమారి, బొంబాయి, ద్వారక, హరిద్వారం, కాశి, గయ, పూరి, రామేశ్వరం, బెజవాడ — ఇదియు సంపూర్ణయాత్రయె.

3. బెజవాడ, రామేశ్వరం, కన్యాకుమారి, బొంబాయి, బెజవాడ — ఇది రామేశ్వరయాత్ర.

౪. బెజవాడ, నాగపూరు, ప్రయాగ, హరిద్వారం, కాశి, గయ, పూరి, బెజవాడ — ఇది కాశీయాత్ర.

సమీక్షింపబడిన గ్రంథములు

౧ స్వానుభవములు
౨ క్షేత్రవాసుల కథనములు
౩ క్షేత్రమాహాత్మ్యములు
౪ ఇతిహాసములు
౫ స్థలపురాణములు
౬ భారతము
౭ భాగవతము
౮ దేవీభాగవతము
౯ గర్గభాగవతము
౧౦ శివపురాణము
౧౧ నారదపురాణము
౧౨ విష్ణుపురాణము
౧౩ వాయుపురాణము
౧౪ స్కాందపురాణము
౧౫ పద్మపురాణము
౧౬ బ్రహ్మవైవర్తము
౧౭ మత్స్యపురాణము
౧౮ కూర్మపురాణము
౧౯ అగ్నిపురాణము
౨౦ మార్కండేయపురాణము
౨౧ వరాహపురాణము
౨౨ గరుడపురాణము
౨౩ బ్రహ్మపురాణము
౨౪ బ్రహ్మాండపురాణము
౨౫ వామనపురాణము
౨౬ శివరహస్యఖండము
౨౭ కేదారఖండము
౨౮ కాశీఖండము
౨౯ భీమఖండము
౩౦ బ్రహ్మోత్తరఖండము
౩౧ అవంత్యఖండము
౩౨ నర్మదాఖండము
౩౩ పాంచరాత్రసంహిత
౩౪ సూతసంహిత
౩౫ సనత్కుమారసంహిత
౩౬ విశ్వేశ్వరసంహిత
౩౭ నారదసంహిత
౩౮ దక్షిణామూర్తిసంహిత
౩౯ యాజ్ఞవల్క్యస్మృతి
౪౦ గోపాలతాపిని
౪౧ గౌతమీమాహాత్మ్యము
౪౨ ఏలామాహాత్మ్యము
౪౩ బృహద్గౌతమీయతంత్రము
౪౪ సాంఖ్యాయనతంత్రము
౪౫ ఋగ్వేదము
౪౬ శతాధ్యాయి
౪౭ భగవద్గీత
౪౮ కాళికాగమము
౪౯ లలితారహస్యము
౫౦ మతంగవృత్తి
౫౧ మేఘసందేశము
౫౨ రఘువంశము
౫౩ చారోంధామ్ (హిందీ)
౫౪ తీర్థాంక (,,)
౫౫ భారత ప్రభుత్వ యాత్రా
చారశాఖ ప్రచురణలు
౫౬ వివిధరాష్ట్ర ప్రభుత్వ
సమాచారశాఖ ప్రచురణలు
౫౭ వివిధ రైల్వేల యాత్రా
చారశాఖ ప్రచురణలు

విషయసూచిక

౩ కాశీఖండము

ఇందలి ప్రధానములు

మహాక్షేత్రములు
క్షేత్రాంతరములు
మహానదులు
ఉపనదులు
సరోవరములు
తీర్థములు
కుండములు
పర్వతములు
దేవాలయములు
మహావృక్షములు
చారిత్రక స్థానములు
వివిధరాష్ట్రములు
జలపాతములు
యంత్రాగారములు
విశ్వవిద్యాలయములు
ద్వాదశజ్యోతిర్లింగములు
నవనారసింహాలు
శక్తిపీఠములు
పంచారామములు
సప్తసాగరసంగమములు
శివక్షేత్రములు
విష్ణుక్షేత్రములు
బౌద్ధక్షేత్రములు
ఇతరములు

ప్రస్తావన

"గచ్ఛ గౌతమ! భద్రం తే గ్రామేషునగరేషు చ,
ఆహారాసనశయ్యాదీన్ కల్పయస్వ మహామునే!"

సుందర భారత పూర్ణయాత్రోత్సుకులైన మహనీయుల అడుగుజాడలలో సంప్రదాయానుసారము ముందుగా గౌతముని ప్రార్థించి, నాకు నాసహ యాత్రికులకు అభ్యుదయ పరంపరాభివృద్ధిని అనుగ్రహించవలసినదని గణనాయకునికి నాయిష్టదైవమునకు గురువులకు నమోవాకములు పలికి, ఒక శుభ ముహూర్తమున సుస్నాతుడనై దీక్షాకంకణధారినై రత్నాకరమహోదధివలయితమై వింధ్యమేఖలయై స్వచ్ఛహిమాలయకిరీటినియైన భారతమాతనిసర్గ మనోహర రూపమును కాంచతలచిన తరి; ప్రయాగవాస్తవ్యులు పరమపూజ్యులు ప్రాతఃస్మరణీయులు అగు శ్రీ ౧౦౮ ప్రభుదత్తబ్రహ్మచారి మహారాజులు, లోకకల్యాణార్థమై త్రివేణీతీరమున ౧౧ రోజులు అఖండమహాసంకీర్తన, రుద్రయాగము చేయసమకట్టి మాకు తెలుపగ, కొందరమిత్రులము పరమానందముతో పయనమై తీర్థరాజ మగు ప్రయాగ చేరి, వివిధ ప్రదేశములనుండి యేతెంచిన భక్తసంఘములతో వేలాదిమహాత్ములతో కలసిమెలసి, పదిరెండురోజులుగడపితిమి. పిమ్మట శ్రీ బ్రహ్మచారిగారి ఆజ్ఞ ఆశీర్వచనములబడసి, తీర్థయాత్రకు సమకట్టి పర్యటనారంభమున—

"మలయమనగ శుక్తిమంతంబునా వింధ్యమనగ పారియాత్రమన మహేంద్రమన ఋక్షమన సహ్యామనగ కల సప్తకులనగంబులును; గంగయు, తుంగభద్రయు, వేత్రవతియు, వేదవతియు, కృష్ణవేణియు, పెన్నయు, యమునయు, తమసయు, శరావతియు, కావేరియు, గోదావరియు, నర్మదయు, బాహుదయు, సరయువును, శతద్రువును, వితస్తయు, విపాశయు, తామ్రపర్ణియు నను మహానదులును—అటనటకలుగు సరి ద్విశేషంబులును, పాంచాల పాండ్య బర్బర వత్స మత్స్య మగధ మళయాళ కళింగ కుళింగ కురురు కొంకణ టెంకణ త్రిగర్త సాముద్ర సాళ్వ శూరసేన కుధేష్ణ సహ్మ కురు కరూశ కాశ కోసల యవన యుగంధర ఆంధ్ర సింధు చేది చోళ పుళింద పుండ్రక పాండ్య ఆభీర సౌవీర సౌరాష్ట్ర మహారాష్ట్ర విదేహ విదర్భ ద్రవిడ కుశార్ణ కర్ణాట గౌళాంగ వంగ మరాట లాట బాహ్లిక బహుదాన కిరాత కేకయ అశ్మంతక కాశ్మీర గాంధార కాంభోజ కేరళ మాళవ నేపాల ఘూర్జర కుంతల అవంతిక అనూపాది" పూర్వ జనపదంబులకు ఆధునిక రూప

ములుగా భాసిల్లిన త్రింశ ద్రాష్ట్ర విశాలరూపమైన నవభారతావనిని యథావకాశముగ సందర్శించి, సర్వ పుణ్యతీర్థంబుల నదీ నదంబుల సమయానుకూలంబుగ గ్రుంకు లిడి, ప్రత్యూషంబుల సవిత్రు పాద ప్రణామంబు లాచరించి, ముముక్షుజన కల్పతరువులును, భక్త బాంధవులును నగు ప్రత్యక్ష దైవతములనారాధించి, తదీయక్షేత్ర మాహాత్మ్య మరసి, అయ్యయితావుల పారలౌకిక క్రియల వేదోక్తంబుగా ననుష్ఠించి, దేశాటన కుతూహలురైన నను బోంట్లకు అనుభవైకవేద్య మగు పుణ్యవినోదఫలము లన్నింటిని సంతరించుకొని ఐహికాముష్మికములు రెండింటిని సముపార్జించుకొని ధన్యులమైతిమి.

స్వగృహము చేరి మా యాత్రానుభవములను భారతమాత నిసర్గ మనోహర రూపమును పాఠకమహాశయుల మనశ్చక్షువులకు ప్రత్యక్షము గావించు తమకంబున సరసపదవిన్యాస విశేషముల యాత్రా కథాక్రమాఖ్యానంబున కుపక్రమించుతరి, స్వయంప్రకాశమాన తేజుండును మిత్రుండును మిత్రసులభుండునైన నొక మహనీయమూర్తి నన్నావేశించి సర్వ భారతనగర స్థితంబులైన ఎల్ల చోద్యంబులను, మనోజ్ఞదృశ్యంబులను ఆయా పుణ్యతీర్థ వినోదస్థలవిశేషంబులను, కర్ణపేయమైన మధురిమ్యంబైనచోవిలాసముతో శ్రుతపరచినందున చిరంతనమైన మదీయమనోవాంఛితంబు ద్విగుణితోత్సాహమై అయత్న స్థిరముగా నెఱవేరినట్లయ్యె.

మనోహరమైన మాయీ సుందర భారతయాత్రాక్రమమున ఆయా తావుల తమ యాతిథ్యవిశేషంబులచేతను, చిత్ర విచిత్ర ఛాయాచిత్రదాన మహిమంబుచేతను, మరింతరమణీయముగ నేత్ర పర్వంబుగ రూపొందజేసిన అయ్యాయి ప్రభుత్వాధినేతలకు జోతలువెట్టి, సుందరంబైన అక్షర రూప మిచ్చిన కృపామతులు జానకీరాములకు, జోహారులుపలికి, రూపశ్రీ చెలువారు చిత్తరువులచే గ్రంథమునకు అలేఖ్యతనూ విలాసము సమకూర్చిన మునిస్వామి రామగోపాలునికి శ్రీరాములకు, సీతారాములకు ధన్యవాదంబులర్పించి, కృతార్థుండ నాదలంచితి.

ఈబృహత్ప్రయత్నంబునకు ముందునిలిచి, ఆశీఃపురస్సరముగా సువర్ణాక్షతలు దయచేసిన జ్ఞాన వయోవృద్ధులు అభినవతిక్కన శ్రీ సుబ్రహ్మణ్యకవివతంసులకు, సరస సంగీత సాహిత్య చక్రవర్తులు శ్రీ అనంతకృష్ణశర్మాభిధానులకు, శతావధానపూర్ణులు శ్రీ చిన సీతారామస్వామి శాస్త్రులవారికి, సాహిత్యభూషణులు శ్రీ సత్యనారాయణాఖ్యులకు, వైయాకరణశిరోమణులు శ్రీ వేంకట

ప్రస్తావన

రమణాభిధులకు, పూర్ణప్రజ్ఞావతంసులు శ్రీ వేంకటశేషశాస్త్రిశతావధానులకు, విద్వజ్జనమాన్యులు శ్రీ బులుసు పండితులకు, బాలవాఙ్మయబ్రహ్మలు శ్రీ దీక్షితులవారికి, చరిత్రరహస్య ప్రకాశనచణులు శ్రీ సోమశేఖరులకు, విద్యార్థికమల దివాకరులు శ్రీ వేంకటావధాని భట్టాచార్యులకు, రస హృదయ గ్రహణ పారీణులు ఆచార్య! శ్రీసుబ్రహ్మణ్యశాస్త్రివరులకు, మహానుభావులు శతావధానులు శ్రీ శివరామశాస్త్రిపాదులకు, కృతజ్ఞతాపూర్వక సాష్టాంగ నమస్కారము లాచరించి, నీరాజనమర్పించిన సర్వతోముఖ ప్రజ్ఞావంతులు శ్రీ భానుమూర్తి సార్థక నామధేయులను, గ్రంథలేఖనమున సహకరించిన, నా సోదరుడు శ్రీ సూర్యప్రకాశమును, అనురాగపురస్సరముగా ఆశీర్వదించుచున్నాను.

మరియు నా యీ కృషికి బహువిధముల సహకరించిన, శ్రీ కేశవతీర్థ స్వామివారికి, శ్రీ వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రిగారికి, శ్రీ మద్దులపల్లి వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రిగారికి, శ్రీ గట్టి లక్ష్మీనరసింహశాస్త్రిగారికి, శ్రీ కుందుర్తి వేంకటనరసయ్యగారికి, శ్రీ అవ్వారి హనుమయ్యగారికి, శ్రీ ఉపాధ్యాయుల సుబ్రహ్మణ్యంగారికి, శ్రీ దోనేపూడి సుబ్రహ్మణ్యంగారికి, శ్రీ ధన్యంరాజు అప్పారావుగారికి, శ్రీ శిష్ట్లా సత్యనారాయణగారికి కృతజ్ఞతాపూర్వక నమస్కారములు.

ఇక యీ గ్రంథ విషయం బెట్టిదనిన 'బాణోచ్ఛిష్టమిదం జగత్' అన్నట్టు సర్వము సత్పురుషుల ఉచ్ఛిష్టమే కదా! నాదని సగర్వముగా పేర్కొనదగినది భాష. నా అనుభవములు నా ఎఱిగినంతలో స్థలపురాణాదులనుండి, కైఫీయతులనుండి, ఆయాయి రాష్ట్రప్రభుత్వములు, యాత్రికశాఖాధికారులు, వివిధ రైల్వేల యాత్రిక సమాచారశాఖాధికారులు దయచేసిన గ్రంథములనుండి, తీర్థయాత్రాసక్తులైన అనుభవజ్ఞులవలన విని స్వయముగాకని, విబుధజనులవలన తెలిసికున్నంత సమాచారసర్వస్వమును ఈ పాత్రమునందు పొందుపరచితిని.

అల్పజ్ఞుండను, అర్థశూన్యుండను, సామగ్ర్యరహితుండను, అయిన నాకీ సుందరభారతయాత్రా సంకల్పము కలుగుటయేమి? దానిని పరమపూజ్యులు, ప్రాతఃస్మరణీయులు శ్రీ ౧౦౮ ప్రభుదత్తబ్రహ్మచారి మహారాజులు ఆశీర్వదించుటయేమి? శ్రీ వేమురాజు భానుమూర్తి ప్రభృతుల వంటి మిత్రులు కరావలంబన మిచ్చుటయేమి? జానకీరామ నామాంకితమైన ముద్రణాలయాధిపతుల యీ గ్రంథమునకు సర్వాంగసుందరస్వరూపంబు సమకూర్చుటయేమి? ఓరియంటు ప్రెస్ సంస్థాపకులు ముఖపత్రము (టైటిల్) తీర్చిదిద్దుటయేమి? శ్రీ సీతారాం

గారి వంటి నిపుణ ఛాయాచిత్రగ్రాహకులు, శ్రీ శ్రీ రామపుణ్యా
వంటి వరిష్ఠ కళాకారులు అయాచితముగ యీగ్రంథసరస్వతిని అవ
వేష భాషలతో అలంకరించుటయేమి? అడిగిన తడవుగా వివిధ రాష్ట్ర
ప్రభుత్వాధినేతలు, వివిధరైల్వేల యాత్రికసమాచార శాఖాధికా
స్ఫూర్తిగా సహకరించి సర్వసమాచార వితరణులై సమాదరించుటయే
భవజ్ఞాన పరిణతులైన పండితప్రకాండులు శిరోధార్యములైన రచనలతో
తిలకము దిద్దుటయేమి? గ్రంథావలోకన తత్పరులైన తీర్థయాత్రాచర
పరిశ్రుతాధిక పాఠకమహాశయులు ముందుగా గ్రంథమూల్యము
యేమి? ఈ సర్వశుభశకున ఫలితముగా నే తలపెట్టిన యీసుంద
యాత్ర దిగ్విజయముగా పర్యవసన్నమగుటయేమి? ధ్యానించిచూడ
సర్వము ఆంధ్రదేశపు అభిమానదైవతములైన శ్రీశైల, సింహశైల,
దుర్గిలవరప్రసాదమేకదా!

"యదత్ర స్ఖలితం కించిత్ ప్రమాదేన భ్రమేణవా,
తత్సర్వం శోధయం త్వార్యా కస్య న స్ఖలితం మనః.
గచ్ఛతః స్ఖలనం క్వాపి భవత్యేవ ప్రమాదతః,
హాసంతి దుర్జనా స్తత్ర సమాదధతి సజ్జనః.
బహుచ్ఛిద్రం పరిత్యజ్య గుణలేశ జిఘృక్షయా,
పరిగృహ్ణాం త్వదోషజ్ఞా ఋజవో దంభవర్జితాః."
"యదక్షర పద భ్రష్టం మాత్రాహీనం చ యద్భవేత్
తత్సర్వం క్షమ్యతాం దేవ! నారాయణ! నమోస్తు తే."

ఇతిశమ్

బుధజన విధేయుడు,

మన్మథ శ్రావణము,
తెనాలి.

బులుసు సూర్యప్రకాశ శా
వ్యవస్థాపకుడు : సాధన గ్రంథ మం

పీఠిక

పాశ్చాత్త్యులు దేశాటనమును, విద్యాభ్యాసమున కంగముగాను వినోద పరముగాను భావించియుండఁగా, భారతీయులు ఆ దేశాటనమునే తీర్థయాత్రలఁ బేరఁ బవిత్రీకరించి, దానిని పరమార్థసాధనముగా పరిఢవిలఁ జేసి యున్నారు. ప్రపంచమంతయు పరమేశ్వరస్వరూపమనుట తథ్యమేయైనను, ఆ భావమును అత్యంతపరిపక్వచిత్తులు గాని యందుకొన నేరరు. మఱి, అపరిపక్వచిత్తుల గతి యేమి? అట్టివారలకుఁ జేయూఁత నొసఁగి వారి నొక్క మెట్టు పై కెక్కించుటయు ఉపదేష్టలకుఁ గర్తవ్యము కాదా? “కేషు కేషుచ భావేషు చింత్యో౽సి భగవన్మయా?” అని యర్జునుఁ డంతవాఁడు శ్రీకృష్ణుని ప్రశ్నించెను. ఇఁక నన్యులఁగూర్చి చెప్పవలసినదేమి? ఆకాశము నొఱసి కొనిపోవు శిఖరములుగల శిలోచ్చయములు; కూలంకషములై యఖండవేగమునఁ బ్రవహించు నదీనదములు సృష్ట్యాదినుండియు సూర్యరశ్మియేని చొర నెడ మీని గిరిగహ్వరములు, ఇసుక వేసినను రాలనంత దట్టముగా నల్లుకొని బహు శాఖోపశాఖలతో శోభిల్లు మహారణ్యములు — వీనిం జూచునపుడు యాత్రికుని చిత్తవృత్తి క్షణకాలము స్వీయచింతలను మఱచి, ఆ మహనీయ దృశ్యమందు లీనమగును. ఒకవ్యక్తి హృదయమున భక్త్యాదిబీజములు నాటుటకు సరియైన యదను ఇదియే యని యార్యుల నిశ్చయము. భక్తులు సంగీతముచేతఁ గావించు సిద్ధియు నిదియే. రాగ తాళములకు వశమై, మనస్సు లయించి యుండఁగా, అందు భగవానునిదివ్యతలలు నాటుటయే గానమందలియుద్దేశము. సంగీతమునకు శ్రోత్రేంద్రియము సాధనమైన, ప్రకృతిరామణీయక దర్శనమునకు యాత్రికునకు నేత్రేంద్రియము సాధనము. రెంటను కార్యము, మానసమందలి వాసనలఁ దాత్కాలికముగా నడ్డు రానీయకుండుటయే. అప్పుడు చిత్తము ద్రవించి యేది ముద్రించినను దాని నిలుపుకొన సమర్థమై యుండును. తన్నుఁ దా మఱచుటయే పురుషార్థమునకు చివరిఫలము; అవాంతర ఫలము లెన్నియున్నను, విద్యలయొక్క, కళలయొక్క, యోగములయొక్క చరమలక్ష్య మిదియే యని మనము గ్రహింప వలయును. కర్మయోగి క్రియాకలాపమందు నిమగ్నుఁడై తన్నుఁదా మఱచుచున్నాఁడు. రాజయోగి యోగానుష్ఠానమునఁ దన్నుఁదా మఱచుచున్నాఁడు.

ఇఁక, జ్ఞానయోగి తొలినుండియు స్వస్వరూపమున అహంకారమును లయింపఁజేయఁ జూచుచున్నాడు. వేయేల? వేదాంతములయందుఁ

గాక విషయ భోగములయందును పరిపూర్ణానందము తన్నుఁడా మఱచు నపుడే. “సురతేచ సమాధౌచ, మాయా యత్ర నలీయతే। ధ్యానేనాపిహి కింతేన కింతేన సురతేనవా?” “When shall I be happy?” అను ప్రశ్నమునకు బుద్ధభగవానుఁడు “When you cease to be” అని ప్రత్యుత్తరము చెప్పినట్లు ఐతిహ్యము.

2. పురాణేతిహాసములు తీర్థయాత్రాదికమును అత్యర్థము ప్రశంసించి యుండఁగా, ఉపనిషత్తులలోఁ దన్నిరాసక వాక్యములు బహుళముగాఁ గానవచ్చుచున్నవి. గురుముఖమున గ్రంథములఁ జదువువారు, ఈవైరుధ్యము అధికారభేదమునుబట్టి యేర్పడిన దని సులభముగాఁ దెలిసికొనఁగలరు. అగురులగు స్వతంత్రులు ఈభేదమును సమన్వయపఱచుకొనఁజాలక ఈవాక్యములొండొంటికి విరుద్ధమని తలపోసికొని, గ్రంథములయందలివిశ్వాసమును కోల్పోవుదురు. భాగవతమున భక్తియోగము నగ్గించుచోట, కర్మయోగము ఎట్లెట్లు అపకర్షింపఁబడినదియు మన మెఱుఁగుదుము. ఇక్కడి యుద్దేశ్యము భక్తియోగము నుత్కర్షించుటగాని, కర్మయోగమును అపకర్షించుటకాదు. దీనినే పెద్దలు ‘నహినిందాన్యాయము’ అందురు. అద్వైతులందఱు మోక్షమే జీవితముయొక్క పరమప్రయోజన మనియు, అవిద్యా నివృత్తియే తత్స్వరూపమనియు, నంగీకరించి యున్నారు; ఈయవిద్యమల, విక్షేప, తిరోధాన రూపముగా నున్న దని తత్త్వజ్ఞు లెల్లరు నెఱింగినవిషయమే. కావునఁ దొలుతఁ దొలఁగవలసినది — చిత్తమాలిన్యము. అది తొలంగినంగాని ఒకనికి ఉపాసనయందలి యధికారము లేదు. ఉపాసనము చేత చిత్తవిక్షేపముఁగూడ తొలఁగఁగా పురుషుఁడు స్వరూపాచ్ఛాదకమైయున్న తిరోధానరూపకావిద్యం గడకొత్త సమర్థుఁడగుచున్నాడు. ఇవే, బ్రహ్మస్వరూపావగతికి సాధనములు. చిత్తమాలిన్యము తొలఁగించుసాధనములలో నిష్కామ కర్మాచరణము, భగవన్నామోచ్చారణము గంగాస్నానాదికము (తీర్థయాత్రలలో చేరినది) పేర్కొనఁబడినవి. నిష్కామకర్మాచరణమునకు మానవునకుఁ గొంతకుఁ గొంత సంస్కార ముండవలసియున్నది. భగవన్నామోచ్చారణము ఎన్ని యుపాయముల పొల్పుఱచినను విసువు కొల్పవచ్చును. మూఁడవ దగు తీర్థయాత్రల నిట్టి యిక్కట్టులు లేవుగాని, దానికి శరీరదార్ఢ్యము, ధన సంపత్తి, మనుష్య సాహాయ్యము అవసరములు. ఈ యన్నియుఁ గలవానికిఁ దీర్ఘ యాత్ర సద్యస్సిద్ధిప్రదము.

3. భారతదేశమునందలి పుణ్యక్షేత్రములు అసంఖ్యాకములు. పురాణములలో (కాశీఖండము మొదలగునవి) వాని పేర్మి అగ్గలముగా నుగ్గడింపఁబడి తత్తత్ క్షేత్రముల దర్శించి, తత్తత్తీర్థముల నాడి కృతార్థులైనవారి చారిత్రములు హృదయంగమముగాఁ జిత్రింపఁబడియున్నవి. వీనినమ్మి యాత్రలకుఁ దొడంగువారు ధన్యులు. "శ్లో॥ మంత్రే తీర్థే ద్విజే దైవే దైవజ్ఞే, భేషజే గురౌ, యాదృశీ భావనా యత్ర సిద్ధిర్భవతి తాదృశీ" అనుట నిరవద్యము. బ్రహ్మవిదుల నుద్దేశించి చెప్పఁబడిన పెద్దపెద్దమాటల నూఁది యాత్రలు నిష్ఫలము లని వానికిఁ దొడఁగనివాఁడు రెంటికిం జెడిన రేవఁ డగుచున్నాఁడు. పూర్వాపూర్వ నిరోగమాలఁ బాటించి, పైమెట్టుకు రావలయుఁగాని, ఒక్కగంతులోనే గంతవ్యము చేరవలయుననుకొనువాఁడు కాలువిఱుచుకొని పురోగమింపలేక యే పోవచ్చును.

శ్రీపర్వతం శిరస్థానే, కేదారంతు లలాటకే
వారాణసీ మహాప్రాజ్ఞ, భ్రువో ర్ఘ్రాణస్య మధ్యమే.
కురుక్షేత్రం కుచస్థానే, ప్రయాగం హృత్సరోరుహే
చిదంబరంతు హృన్మధ్యే, ఆధారే కమలాలయమ్॥

అని యుపక్రమించి,

ఆత్మతీర్థం సముత్సృజ్య, బహి స్తీర్థాని యో వ్రజేత్
కరస్థంతు మహారత్నం, త్యక్త్వా కాచం విమార్గతే॥

అనియు,

చిత్త మంతర్గతం, దుష్టం తీర్థస్నానై ర్నశుద్ధ్యతి
శతశో౽పి జలై ర్ధౌతం, సురాభాండ మివాశుచి॥

అనియుఁ జెప్పిన యుపనిషత్తే,

విషువాయనకాలేషు, గ్రహణే చాంతరే కదా
వారాణస్యాదికస్థానే, స్నాత్వా శుద్ధో భవేన్నరః॥

అని గంగాస్నానమును వెంబడి కొనియాడియున్నది. సమ్యగ్దర్శనము కల పెద్దలు, సర్వసంగము త్యజించిన పరివ్రాట్టులు, ఈక్షేత్రముల నప్పటి కప్పటికి దర్శింతురనుటయు తీర్థముల గ్రుంకుదురనుటయు యథార్థము. అట్టివారి సంస్పర్శముచేఁ బావనములైన తీర్థక్షేత్రములలో యాత్రికుఁ డెట్టి యభ్యుదయముల కెదురుచూడరాదు? మహనీయులైన బ్రహ్మశ్రీ బులుసు సూర్యప్రకాశశాస్త్రులవారు వీనింగూర్చిన బహుగ్రంథములను బరిశీలించుటయే గాక తాము స్వయముగా పర్యటించి ఈపుణ్యక్షేత్రములలో ఎక్కడెక్కడ నేవిదర్శనీయములో పోవునెడ నేయేవస్తువులఁ దీసికొని పోవలయునో స్వానుభూతిమీఁద నతినిపుణముగ వివరించియున్నారు. ఈ 'సుందరభారతయాత్ర' పుణ్యక్షేత్ర తీర్థజిగమిషులపాలిటి పారిజాతవృక్షముగా నున్నది. ఎన్ని చరిత్రాంశములు! ఎన్ని స్థానికకథలు! ఎన్ని ధర్మశాస్త్రవిషయములు — ఇదియొక గ్రంథ సర్వస్వముగా నున్నది. గ్రంథకర్త సంకల్పించిన రెండవభాగమును వెలువడి ఆంధ్రుల కరముల నలంకరించుఁ గావుతమని యాశీర్వదించుచున్నాను. శాస్త్రులవారి గ్రంథరచనోద్దేశ్యము భగవంతుని కరుణచే, ఫలవంతమగును గావుత!

నెల్లూరు,
18-5-1955.

మహోపాధ్యాయ,
దుర్భా సుబ్రహ్మణ్యశర్మ

'క్షేత్రస్య స్మరణాదేవ
మహాపాతక నాశనమ్.'

......పోయి సేవింపలేకున్న పుణ్యతీర్థ
మహిమ వినుటయు నఖిలకల్మషహారంబు.

సుందర భారత యాత్ర

యాత్రా వైభవము

పరిచయము

యాత్రల ఆవశ్యకత ప్రయోజనము వీనినిగూర్చి నేఁడు నేనఁగాని, యెవరుగాని క్రొత్తగా అభిప్రాయ మియ్యవలసినదేమి? తీర్థక్షేత్రములందే ఇంతవఱకు భారతదేశపు జ్ఞాన విజ్ఞాన కళా శిల్పముల యౌన్నత్యము కేంద్రీకృతమైయున్నది. ఆయా స్థలములకు యాత్ర సాగింపనిది మనదేశపు ప్రకృతి సౌందర్యముగాని, మన ప్రాచీనతపస్సుల ఆధ్యాత్మికాధిభౌతికాధిదైవిక సిద్ధులుగాని పరాయణములుగాని గోచరింపవు. ఆ పుణ్యమధురక్షేత్రముల మాహాత్మ్యములను స్వానుభవపూర్వకముగా ప్రకటించు తమ సంకల్పము సర్వశ్లాఘ్యము. అది నిర్విఘ్నముగా నెరవేరుగాక !

ఓరియంటల్ ఇన్‌స్టిట్యూటు
తిరుపతి

రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

తీర్థ నిషేవణము

ధర్మచింతతో యాత్రలు చేయుట అన్ని మతముల లోను ఉన్న పురాతనాచారము.

పుణ్యపురుషులును అవతార పురుషులును ఉదయించిన ప్రదేశములు, వారు సంచరించిన ప్రదేశములు, వారు నిర్యాణము నొందిన ప్రదేశములు జనసామాన్యమునకు సంసేవ్యములు.

మనుష్యుడు తాను తన దౌర్బల్యమువలన మంచి గుణము లలవర్చుకొని నియమ బద్ధమైన జీవితమును గడపి, ఉత్తమ పురుషుడు కాలేకపోయినను లోకోత్తర చరితులను, అవతార పురుషులను భక్తిప్రపత్తులతో సంభావించి ఆరాధించి, వారి జన్మచేతను సంచారముచేతను నిర్యాణముచేతను పవిత్రములైన ప్రదేశములను సందర్శించియైనను ధన్యత నొందుటకు కుతూహల పడుచుండును. అప్రాకృతమైన ఈ ధార్మికాకాంక్షయే కుతూహలమే సాధారణముగా యాత్రలను ఆచారమునకు మూలకారణము.

ఇప్పుడిప్పుడు క్రైస్తవులలో తగ్గిపోవుచున్నను మధ్య యుగమునాటి వారి ధార్మికజీవనములో యాత్రలు ప్రముఖస్థానము నాక్రమించినవి. ఏసుక్రీస్తుతో సంబంధముగల పాలస్థానము (Palestine) లోని యెరూషలేము (Gerusalem) ను, అపొస్తలులతో సంబంధముగల ఇటలీలోని రోమునగరమును సందర్శించుటకు ధార్మికచింతగల క్రైస్తవులు యాత్రలుచేయువారు.

మహమ్మదీయులలో మక్కా-మదీనాలకు ఏటేట యాత్ర చేయుట వారి మతాచారవిధులలో ముఖ్యమయినది. మక్కా మాట అటుండగా హిందూదేశములోనే అసంఖ్యాములుగ నున్న పీరుల, ఔలియాల, షహీదుల సమాధులు, వాటిని సందర్శించి పూజించుట ఇస్లాము సనాతన ధర్మసూత్రములకు విరుద్ధమైనను, ఏటేట వేలకొలది ముస్లిమ్ యాత్రికులను ఆకర్షించుచునేయున్నవి.

ఇట్లే జైనులును, బౌద్ధులును సందర్శించు పుణ్యక్షేత్రములు అనేకములు. పాలితాన, ఆబూశిఖరక్షేత్రము, గిర్నారు,

పారస్నాథము మొదలైనవి జైనుల యాత్రాస్థలములు. జైనులును, బౌద్ధులునుగూడ వేదమతావలంబులనుండియే ఈ యాత్రాచార విధిని గ్రహించియుందురనుటకు సందియములేదు.

బౌద్ధములో యాత్రలుసలుపు ఆచారము, బుద్ధుడు భగవానుడుగ పరిగణింపబడిన మహాయానసంప్రదాయముననే ప్రాముఖ్యము కలిగినది. ఈ సంప్రదాయము వర్ధిల్లిన కాలముననే బుద్ధభగవానుడు జన్మించిన కపిలవస్తునగరము, మహాబోధివిజ్ఞానము నొందిన బుద్ధగయ, తన ధర్మమును మొదటిమారు లోకములో ప్రవర్తింపజేసిన కాశీనగరము (ఋషిపట్టణము), ఆయన నిర్వాణము నొందిన కుశనగరము బౌద్ధులకు యాత్రాస్థలములైనవి.

హిందూ దేశములో పుణ్యక్షేత్రములను సందర్శించుటకు చేయు ప్రయాణములకు పట్టి యాత్రలని కాక తీర్థయాత్రలని పేరు వచ్చినది. పుణ్యస్థలముల కంటెను, దివ్యక్షేత్రములకంటెను ముఖ్యమైనది తీర్థము. 'తీర్థయాత్ర' లో ఒక్క పుణ్యతీర్థములే కాక దివ్యస్థలములును వచ్చును. మన శాస్త్రములలోను పురాణములలోను వీటికి ఎక్కడలేని పవిత్రత ఆపాదింపబడినది. వైద్యులు కుదుర్పలేని వ్యాధులుకూడ పవిత్ర తీర్థోదకస్నానము వలన పోవునని మన పూర్వుల విశ్వాసము. నీరు గొప్ప రోగనివారిణి పవిత్ర తీర్థస్నానము సకల కల్మషహారము. పాపకర్మములే రోగములకు కారణములు. శరీరమును నీడవలెనే పాపకర్మము మనుష్యుని ఆశ్రయించుకొని జన్మపరంపరకు కారణభూత మగుచున్నది. సంసార దుఃఖసంతరణమునకు ఎన్ని జన్మల వరకో మానవుడు వేచియుండ నక్కరలేదు. జన్మదుఃఖమునుంచి

విముక్తి పొందుటయే ముక్తి, మోక్షము. మనుష్య ప్రయత్న మంతయు చతుర్విధ పురుషార్థములలోని కడపటి పురుషార్థమును సాధించుటకే, మనుష్యుడీజన్మలోకూడ సుశిక్షితమును నియమ బద్ధమును అయిన జీవితమును గడపుచు పుణ్యకార్యము లాచరించి తన లక్ష్యమును సమీపించుటకు ప్రయత్నించవచ్చును. సత్కార్యాచరణము వలన పుణ్యమును అభివృద్ధి నొందించుకొని జన్మ పరంపరను సుదీర్ఘ మొనరించు కర్మశక్తిని క్షయింపజేయవచ్చును. పుణ్య సంపాదనమునకు దానములు, ధర్మములు, ఉపవాసములు, వ్రతములు మొదలైనవి దోహదము లైనను తీర్థయాత్రకు సరిపోవునది వేరొకటిలేదు. పుణ్య నదీతీరములందును, దివ్య క్షేత్రముల యందును చేసిన దానధర్మములును పిండప్రదానములును, క్రతు కర్మాదికములును అధిక పుణ్యప్రదములు. ఈ కారణముచేతనే పుణ్యతీర్థములను సేవించుట, పుణ్య క్షేత్రములను సందర్శించుట భారత వర్షములో చిరకాలముగా వచ్చుచుండిన సనాతనాచారము. తీర్థయాత్రా విశేషములను పులస్త్య, లోమశ, ధౌమ్య, అంగిరసులు మహాభారతములో తెలియ జెప్పియున్నారు. పురాణములును ఉపపురాణములును కూడ తీర్థ, స్థల, క్షేత్ర మాహాత్మ్యములను తెలియజెప్పునవే. మహాభారతమునందరణ్యపర్వములోని తీర్థయాత్రాపర్వము తీర్థవిశేషముల నెరిగించునదే. తీర్థయాత్రా సంసేవనమువలన గలుగు పుణ్యము ఆంధ్రమహాభారతమునందు ధర్మరాజున కిట్లు తెలుపబడినది.

"క్రతుఫలములు వడయుఁగ దుర్గతులను దొరకొనదు తీర్థగమనంబునఁ ద
త్క్రతుఫలము లందుదురు దుర్గతులును నిది మునుల మతము కౌరవ వృషభా."

సమిత విరోధి పుష్కరమనంగ జగద్విదితంబు పుణ్యతీ
ర్థము మునిసిద్ధ సేవ్యము మొదంబున నందుఁ బయోజ సంభవుం
డమరులతోడ సన్నిహితుఁడై వసియించుఁ ద్రిపుష్కరంబులుం
సమములు వాని నెప్పుడును సంస్మృతి సేసినఁ బాయుఁ బాపముల్.

సంసారకూపములో కూరుకొనిపోయిన మనకు తాత్కాలికముగ నైనను ఉన్నత భావములు రేకెత్తించి దివ్యపథమునుచూపి, పుణ్యకర్మాచరణమునకు ప్రోత్సాహము కలిగించుటకు ఏర్పాటయినవి ఈ తీర్థయాత్రలు. తీర్థయాత్రా దినములలో ఇంద్రియనిగ్రహము కలిగి క్రమబద్ధమయిన జీవితమును గడపుట అవసరము. మనస్సు పరిశుద్ధముగ నుండవలెను. ఆలోచనలు వక్రరహితములై యుండవలెను. సేవించుచున్న పుణ్యతీర్థములయందును, దర్శించుచున్న దివ్యస్థలములయందును ప్రత్యయ ముండవలెను. భావన ననుసరించియే యుండును తీర్థయాత్రాఫలము. మన భావన ఎట్టిదో ఫలమును అట్టిదే. చెప్పినారుకదా పెద్దలు పూర్వము.

"మంత్రే తీర్థే ద్విజే దైవే దేవజ్ఞే భేషజే గురౌ
యాదృశీ భావనా యస్య సిద్ధిర్భవతి తాదృశీ"

అని తీర్థములలోనికెల్ల విశేషమహిమగల తీర్థము గంగానది; దివ్యక్షేత్రములలోనికెల్ల సర్వోత్కృష్టమైన దివ్యక్షేత్రము కాశీ.

హిందువుడై పుట్టిన ప్రతివానికి గంగానదిలో స్నానము చేయుట, కాశీవిశ్వనాథుని సేవించుట ఒక తీరని ఆకాంక్ష. రైళ్లు లేని పూర్వకాలములో కాశీప్రయాణము అత్యంత కష్టసాధ్యమైనది. కాశికి యాత్రచేసినవాడు తిరిగి ఇంటికివచ్చుట అపనమ్మకమే. నడచి ఎన్నో మజిలీలు చేసికొనుచు, కాశికి చేరుకొనునప్పటికే కృత్యాద్యవస్థ అయ్యెడిది. మరల కాశినుండి ఇంటికి వచ్చుట

ఒక యెత్తు. ఈ కారణముననే కాశీకిపోయినవాడును కాటికిపోయిన వాడును సమానమను నానుడి కలిగినది.

తీర్థయాత్రలను పెట్టి భారతవర్షమునంతను సాంస్కృతికముగ సమైక్యము కావించినవారు మన పూర్వులు.

"గంగేచ యమునే చైవ గోదావరి సరస్వతి
కావేరీ నర్మదే సింధు జలేస్మిన్ సన్నిధిం కురు"

గంగా యమునా సింధు నదులు మొదలుకొని కావేరిపర్యంతము గల భారతవర్షము సాంస్కృతికముగా ఏకఖండము. కాశీనుండి తెచ్చిన గంగాజలమును సేతుబంధ రామేశ్వరమునొద్ద సముద్రజలమున గలిపినగాని అది పూర్ణయాత్రయే కాదని పూర్వుల భావన.

తీర్థములలో గంగానదియు, దివ్యక్షేత్రములలో కాశీయును అత్యుత్తమములైనవని చెప్పినను పుణ్యతీర్థములు గణించుటకు ఇంకను లేకపోలేదు. ఋషిసంచారముచేత పవిత్రమైన ఈ కర్మభూమిని గల ప్రతిబుగ్గయు, ప్రతి నదియు, ప్రతికొండయు, ప్రతి హ్రదమును, ప్రతి కాసారమును పుణ్యమయినదే. శబ్దకల్పద్రుమకారుని లెక్కప్రకారము ఇట్టితీర్థములు 264. కాని ఇవి యింతకంటెను ఎక్కువే.

"సర్వే ప్రస్రవణాః పుణ్యాః సర్వే పుణ్యాః శిలోచ్చయాః
నద్యః పుణ్యా స్సదా సర్వా జాహ్నవీతు విశేషతః॥"

అన్నారు పెద్దలు. ఒక్కొక్క తీర్థమునకు ఒక్కొక్క ప్రత్యేకఫలము చెప్పబడినది.

పుణ్యము పురుషార్థము మాట ఎటులున్నను దేశదేశములు తిరిగి వేర్వేరుజాతుల జనులతో కలసిమెలసి సంచరించి

వారి యాచారవ్యవహారములను పరిశీలించుటచేత మన విజ్ఞాన క్షేత్రము విశాలమగును; పుణ్యతీర్థస్నానము హృదయమాలిన్యమును బోగొట్టి మనస్సునకు నిర్మలత్వము చేకూర్చును; ఆయా క్షేత్రములందలి అద్భుత శిల్పాలంకార విరాజితములైన దేవాయతనములను గొప్పభవనములను సందర్శించినచో మనలో చెన్నుమాసి పోయిన సౌందర్యరసానుభూతి మరల చిగిరించినట్లయి, మన దృష్టి కొక క్రొత్తవెలుగు వచ్చును; ప్రశాంతములైన నదీతీరప్రదేశములును, నేత్రపర్వమొనరించు పర్వతోపాంతములనున్న ఆశ్రమభూములును మనస్సునకు నిర్మలత్వమును శాంతిని సమకూర్చును. యాత్రానుభవము మనఃపరిణామమునకు తోడ్పడును. ఈ తీర్థయాత్రలు మానవత, త్యాగబుద్ధి, సర్వభూత దయాపరత, అనుభవజ్ఞానము అలవడుటకు మన పూర్వు లేర్పరచిన సాధనలు.

తీర్థయాత్రలను గురించి చక్కని గ్రంథమును ప్రకటించి ధర్మానురక్తులగువారి కందరికి మహోపకారము కావించినందుకు బ్రహ్మశ్రీ బలుసు సూర్యప్రకాశ శాస్త్రిగారిని ఆశీర్వదించుచున్నాను. వారి సాధన గ్రంథమండలి పరమార్థసాధన కుపయోగించు ఇటువంటి ప్రశస్తగ్రంథములను ప్రకటించి ఆంధ్రదేశ ఆధ్యాత్మికాభివృద్ధికి తోడ్పడుగాతమని కోరుచున్నాను. కష్టనష్టముల కోర్చి సాధన గ్రంథ మండలి ద్వారా ఉత్తమగ్రంథములను బ్రకటించుచున్న శ్రీ సూర్యప్రకాశశాస్త్రిగారికి ధర్మపరాయణులు ఉదారహృదయముతో చేయూత నిచ్చెదరుగాక!

మదరాసు

మల్లంపల్లి సోమశేఖరశర్మ

ప్రశంసావేశము

మానవుని జీవయాత్రలో యాత్రలు ప్రధానములు. ఇహపరముల కివి ముఖ్యసాధనములు. లౌకిక విషయజ్ఞానమునకును, పారలౌకిక విజ్ఞానమునకును పరమోపాధులు. ఎట్టి వివేకహీనుని కయినను దేశాటనమువలన వివేకము కలుగునని పెద్దల నానుడి. ఇట్టియెడ విశిష్టములగు తీర్థయాత్రల వలన నయ్యది యినుమడి యగుననుట అత్యుక్తి కానేరదు.

భారతదేశమునందు పుణ్యస్థలము లసంఖ్యాకములయి యున్నవి. ఆర్యావర్తమునందును, దక్షిణాపథమునందును పేర్వెఱుగ కొన్ని క్షేత్రములున్నవి. నూటయెనిమిది దివ్యతిరుపతు లనఁబడు వైష్ణవక్షేత్రములును, పృథివ్యాదిలింగములు, సుబ్రహ్మణ్యాలయములు మున్నగునవికల శైవక్షేత్రములును దక్షిణాపథమున విశిష్టములు. శ్రీకృష్ణుఁడు ప్రధాన దైవముగాఁగల పుణ్యస్థలములు, శివుఁడు ముఖ్యదైవముగాఁగల క్షేత్రములును ఆర్యావర్తమున నధికముగా నున్నవి.

అయోధ్యాదులగు మోక్షప్రదములగు సప్తపురములును భారతదేశమునందలి భిన్నభిన్నప్రాంతములందు వెలసి సర్వజనాకర్షకములై యున్నవి. వీని నన్నింటిని గాకున్నను, కొన్నిటిని దర్శించినను పారలౌకిక ప్రయోజనము కలుగుటయే గాక, దానితోఁబాటు లౌకికజ్ఞానము అధికమగును. భిన్నభాషలు, విభిన్న నాగరకతలు, వివిధ ప్రాంతములవారి ఆచార వ్యవహారములును అవగతము లగును.

యాత్రలు విద్యాసముపార్జనమునకును సాధనములు. ఆ యా క్షేత్రములలోని స్థలజ్ఞులతోడి పరిచయము వలన నది కొంత సిద్ధించును. ఆయా క్షేత్రముల కొక్కొకవిశిష్టత యుండుట వలన, అచటికిఁ బోయినచో యాత్రికులకు మనః పరిపాకము కలుగ నవకాశము కలదు; ప్రకృతి శోభను తిలకించి యానందించుటకును, నైసర్గిక స్థితుల నవగాహన మొనర్చుకొనుటకును వీలుకలుగును. శరీరము శ్రమపడుట కలవాటు పడును; సహన భావము, పరోపకారబుద్ధి కలుగును. ఆయా దేశముల చరిత్రను తెలిసికొన వీలగును. లేనిచో, జనులు కూపస్థ మండూకము వలె ప్రపంచజ్ఞాన రహితులై యుందురని పలువుర అభిప్రాయము.

యాత్రలు చేయఁదలంచువారి కాయా స్థలముల విశేషములను దెలిసికొనుటలో యాత్రా చరిత్రములు మిక్కిలి యుపయోగించుచున్నవి. యాత్రికు లట్టి గ్రంథముల సాయమున అనన్యాపేక్షముగ తమ తీర్థయాత్రలను ముగించుకొనఁ గలరు. ఇట్టి గ్రంథములు లేనియెడల యాత్రలు చేయుటలో ఎక్కువ శ్రమపడవలసి వచ్చును. ఇట్టి చరిత్రములు పయి దేశములలో నెక్కువగఁ గానవచ్చుచున్నవి. విదేశీయులు పవిత్ర స్థలములు కేఁగవలెనని కుతూహల పడకున్నను, ప్రపంచమందలి వివిధదేశములలోని వింతలను జూడవలెనని ఎక్కువ కుతూహల పడుచుందురు. ధైర్యసాహసములతో దుర్గమ ప్రదేశములకుఁ గూడఁబోయి యచటి విశేషములను గనుగొనుచుందురు. ఇట్లు యాత్ర లొనర్చిన ధీరులు తమ యనుభవముల నన్నిఁటిని గ్రంథ

స్థము చేయుదురు. వారు సేకరించిన యిట్టి చరిత్రములే యాత్రాచరిత్రములుగా ప్రసిద్ధికెక్కి యున్నవి. ఈ విషయమున మెగస్తనీసు, హ్యూయన్‌త్సాంగు, ఫాహియాను, అబ్దుల్‌రజాక్ మున్నగువారు ప్రశంసనీయులు.

యథార్థములు, సమగ్రములు నగు చరిత్ర గ్రంథములే యరుదుగాఁగల మన భారతదేశమున ప్రాచీనకాలమున యాత్రా చరిత్రములు వెలువడకుండుటలో వింతలేదు. వచన కావ్యములే వెలువడని ప్రాచీనకాలమున తెలుఁగులో యాత్రా చరిత్రములు వెలయలేదని వేఱుగఁ జెప్పనక్కఱలేదు. పందొమ్మిదవ శతాబ్ది తొలిభాగమున ఏనుగుల వీరాస్వామయ్యగారు తాను చేసిన కాశీయాత్రయందలి విషయములను 'కాశీయాత్రా చరిత్ర' అను గ్రంథము రూపమున వెలయించి యున్నారు. కోలా శేషాచలకవి యనునొక చెన్నపురి వాస్తవ్యుఁడు తాను 1846-వ సం॥ లో నొనర్చిన నీలగిరియాత్రను ప్రౌఢవచనమున వివరించియున్నారు. మఱియు 'కాశీయాత్ర, దివ్యస్థలమార్గదర్శిని' మున్నగు క్షేత్రమాహాత్మ్యాదులను వివరించు గ్రంథములు కొన్ని వెలువడినవి. ఈ శతాబ్దిలో శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిగారి 'నా మహారాష్ట్రయాత్ర' ఎన్నఁదగినది. ఇవి అన్నియును పరిమిత ప్రయోజనము కలవి.

సాధన గ్రంథమండలి వారు ప్రకటించుచున్న 'ఆనంద భారతయాత్ర' యాత్రాచరిత్ర గ్రంథములలో అగ్రగణ్యమైనది. అపరిమిత ప్రయోజనములు కలది. ఇందు ఆరు ఖండములలో భారత దేశమునందలి పుణ్యక్షేత్రముల వృత్తాంతము సంగ్రహము

గను, సమగ్రముగను వివరింపఁబడినది. యాత్రార్థుల కిది యెంతయు నుపయుక్తమైనది.

యాత్రాస్థలములను గూర్చిన విషయములు కొంతవఱకును రైల్వేశాఖవారు ప్రకటించుచున్న 'గయిడు'లలోఁ గలవు. కాని, అవి ఏవో కొన్ని ప్రసిద్ధ స్థలములను గూర్చిన సమాచారమునే తెలుపును. ఆవిషయ మాంగ్లభాషయందే ఉండుటవలన, అందరికిని అందుబాటులో లేవు. కావున, అట్టివానివలనఁ బ్రయోజనము తక్కువ.

ఏదో యొక గ్రంథమునుగాని, వివిధ గ్రంథములనుగాని పరిశీలించి, అందలి విషయములను గ్రహించి యిట్టి చరిత్రములను వ్రాయవచ్చును. కాని, వానిలో వివరింపఁబడిన విషయముల సత్యత్వమున సందేహము కలుగవచ్చును. ఈ 'సుందర భారతయాత్ర'ను రచించిన శ్రీ బులుసు సూర్యప్రకాశశాస్త్రి గారు, తాము తీర్థయాత్రలు చేయుచు, గడించిన అనుభవమును, సేకరించిన విషయములను క్రోడీకరించి గ్రంథరచన సాగించుటచే, ఇందలి విషయములన్నియు యాత్రాపరుల కత్యంతోపయుక్తములయు, ఏతద్గ్రంథమును దగ్గఱనుంచుకొని పుణ్యస్థలముల కేఁగినచో అనాయాసముగ నభిమతకార్యమును నెఱవేర్చుకొనవచ్చుననియు నొక్కి చెప్పవచ్చును. ఇందు ప్రసిద్ధక్షేత్రములకు సంబంధించిన చిత్రములు కూడఁ జేర్పఁబడియున్నవి. "యాత్రా ఖండ"మను తొలిఖండమునందు సర్వక్షేత్ర సాధారణములగు "తీర్థస్వరూపము, తీర్థభేదములు, యాత్రాప్రయోజనము, తీర్థవిధులు, తద్విశేషములు, యాత్రావస్తు సామగ్రి, ముఖ్యమైన

గమనింపు, ఆహారవిషయము, రైల్వేసమాచారము, డబ్బు, పండాలు, సామాను" మున్నగు విషయములు వివరింపఁబడినవి. యాత్రాది విశేషమునఁ బెక్కు ప్రమాణములు చూపఁబడినవి. యాత్రలం గూర్చిన సమగ్రవిషయములం దెల్పు గ్రంథములలో నాంధ్రమున నిదియే మొదటిదనియుఁ జెప్పవచ్చును.

తెనాలిలోని 'సాధన గ్రంథ మండలి' సంస్థాపకులైన శ్రీ బులుసు సూర్యప్రకాశశాస్త్రిగారు ఆధ్యాత్మికజ్ఞానమునకును, పారలౌకిక సుఖమునకును సాధనచేయుట కనుకూలములగు గ్రంథములను ప్రకటించుచు ధర్మజిజ్ఞాసలో వెనుకపడియున్న తెలుఁగునాడు పురోగమించుటకు దోహద మిచ్చినారు; ఇచ్చుచున్నారు. శ్రీ శాస్త్రిగారు పయి యాశయముతోనే తమ యాత్రానుభవముల నీరీతిని గ్రంథరూపమునఁ బ్రకటించుట ఎంతయు నుచితముగా నున్నది. యాత్రాపరులేగాక ఇతరులును, ఈ గ్రంథమును పఠించినచో వివిధ స్థలములలోని పెక్కు విషయములను దెలిసికొనఁగలరు. ఆంధ్రులందఱు నేతద్గ్రంథమును పఠించి శ్రీ శాస్త్రిగారి పరిశ్రమను కృతార్థ మొనర్చి తమ్ము చరితార్థుల నొనర్చుకొందురుగాక!

మదరాసు
2-5-55

బులుసు వేంకట రమణయ్య

యాత్రాప్రశంస

తాము ముద్రింపఁదలంచిన పుణ్యక్షేత్ర ప్రదర్శనగ్రంథ మత్యావశ్యకము. అయ్యది జనుల కిహపరసాధకము కాగలదు. నారద, రోమశాది మహర్షులవలెఁ దాము దేశాటనముజేసియు వివిధ పుణ్యక్షేత్రముల విషయమున నాయాపురాణాదులలోని విషయముల నేర్చి కూర్చియు, నట్టి యుత్తమ గ్రంథమును రచించి ప్రకటింపఁబూనుట యాంధ్రుల మహాభాగ్యము !

"యాత్రల యావశ్యకత, ప్రయోజనము" మున్నగు వాని ఘనత మహాభారతాది గ్రంథములలో విస్తృతముగ వివరింపఁబడినది.

"క్రతుఫలములు వడయఁగ దు
ర్గతులకు దొరకొనదు తీర్థగమనంబునఁ ద
త్క్రతుఫలము లందుదురు దు
ర్గతులును నిది మునుల నుతము కౌరవవృషభా !"

భా. అ. ఆ. 2. 243

"నిరముగఁ దీర్థసేవా
పరులగు శాంతాత్ములకుఁ దపస్వులకును దు
ష్కర మెద్దియు లేదని చె
చ్చెర ధర్మజుఁ దీర్థసేవ సేయింపు మొగిన్."

భా. అ. ఆ 2. 298

వ. ...అజాతశత్రుండు రోమశున కిట్లనియె... మఱియు నచేతనంబులయ్యును గిరిసరిత్సరోవరంబులు పుణ్యతీర్థంబులై జగత్పావనంబులై జనులకు దురితాపహారంబులైన కారణంబేమి ? యని యడిగిన నతనికి రోమశుండిట్లనియె ... ధర్మవర్తులైన దేవ

తలు ఋషులు నాశ్రయించుటం జేసి తీర్థంబులు పవిత్రంబులై సర్వకామప్రదంబులై వర్ధిల్లుచుండు..."

భా. ఆ. ఆ. 2. 311–317

వేయేల! తీర్థసేవనమునే కాక పుణ్యక్షేత్రప్రదర్శగ్రంథములఁ జదివినవారును, వినినవారును నిహపరముల సద్గతులగుదురు.

"విదితముగఁ దీర్థకీర్తనఁ
జదివిన ధన్యులకు వినిన సజ్జనులకు న
భ్యుదయమగు సర్వతీర్థ స
ముదయస్నాన బహుయాగముల ఫలములగున్." భా. ఆ. ఆ. 2. 283

"ఇది నిక్కువ మని మనములఁ
బదిలంబుగఁ దీర్థసేవ భక్తిఁ దలఁచినన్
విదితముగ దురితహరమగు
సదమల సుజ్ఞానులగుట సత్యము ధరణిన్." భా. ఆ. ఆ. 2. 284

"సకలదురితముల వాయుదు
రకలంక మనస్కులగుదు రార్యోత్తమ వ
ర్తకులగుదురు సజ్జనగుణ
నికరంబుల వెలయుదురు సునిశ్చితమతులై." భా. ఆ. ఆ. 2. 285

తీర్థయాత్రలవిషయమున వివిధ పురాణేతిహాసాదులలోఁ జెప్పఁబడిన విషయములను బ్రదర్శింపనున్న మీకితోఽధికముగ వ్రాయుట యనావశ్యకము.

కళాప్రపూర్ణ

విజయనగరం వజ్ఝల చినసీతారామస్వామిశాస్త్రి

ఆశ్చర్యము - పరమాత్మ

మానవుడు తనబుద్ధికి అతీతమయిన దృశ్యమును జూచి నపుడు ఆశ్చర్యములో కూరుకొని పోవును. పరమసుందర మగు దృశ్యమును జూచినపుడును ఆరీతిగనే తన్మయు డగును. అతని అప్పటి స్థితికిని ఈశ్వరతత్త్వమునకును ఏదో సాదృశ్య మున్నది. 'ఆశ్చర్యవత్ పశ్యతి కశ్చిదేవమ్'

సర్వం ఖల్విదం బ్రహ్మ

బ్రహ్మాండము బ్రహ్మాండము ఈశ్వరుని విభూతి. ప్రతి అణువును విరాడ్రూపము.

ఈ సంగతి ఒకరు చెప్పకున్నను మనకు తెలియును. మనకు తెలిసినను ఇది తెలిసినటు లుండదు. ఏల ? ప్రాణధారణ కును మనోధారణకును ఆవశ్యకములగు పదార్థములతోడి అతి పరిచితి మన తెలివిడికడ్డు. ఎటులు ? మనస్సుచే తన్యోన్ముఖము అనగా విషయోన్ముఖమై కూపాకారము, తటాకారము, నద్యా కారము, సముద్రాకారము తాల్చిన నీ రగు చున్నది. కాని విషయసారమును గుర్తింపదు. విషయసారము సద్వస్తువుకదా ! ఇచ్చట మన కడుపునకు కావలయున్నది కూడు. మన మనసునకు కావలసినది కోర్కి. ఈ రెండును వాని తృప్తికి చాలును. ఇక వాని సారముతో ఏటిపని ? ఈ రీతిగా ప్రతి విషయాభిముఖత యందును మానవుడు భ్రాంతుడగును.

క్షేత్రము - శరీరము

ప్రాజ్ఞు లిది గుర్తించి కొన్ని విరాట్ విభూతులను క్షేత్ర ములుగా గమనించిరి, గమనించు చున్నారు, గమనింపగలరు -

ఈ క్షేత్రములకును మన అందరయు క్షేత్రములకును ఒక సాదృశ్యము కలదు. — ఓ కౌంతేయా ! ఈ శరీరము క్షేత్రము. అని శ్రీకృష్ణుడు అర్జునునితో అనును. ఈ క్షేత్రములను దర్శించినప్పుడైనను మనము క్షేత్రజ్ఞులము కావలయునని మన పితామహుల కోరిక.

సిద్ధులు – సాధకులు

మన దేశములో ప్రాజ్ఞులును, పామరులును, క్షేత్రదర్శన మొనరింతురు. కాశీయాత్ర జీవయాత్రలో ఒకయాత్రగా అందరు ననుసంధింతురు. సిద్ధులకీ క్షేత్రములు అఖండాకారముగా కానిపించును. సాధకులకో సర్వమును బ్రహ్మాకారమని తెలిసికొనుట కుపయోగించును. పామరులకు క్షేత్రయాత్రచే దేశజ్ఞానముతో పాటు లోకజ్ఞానమును కలుగును. ఇది అవాంతరఫలము.

అమృతమందును విషము

యోగ్యుని చేతిలోబడిన విషమును అమృత మగును. అయోగ్యుని చేతిలోబడిన అమృతమును విషమగును. క్షేత్రములందు పామరులచే కలిగిన పాపములుచూచి కాబోలు, వేమన మొదలగువారు క్షేత్రయాత్రలను, నిట్టనిలువుగా నిరసించిరి.

> " తినదే చెట్టులయాకు మేక, గుహగొందిన్ బాము నిద్రింపదే;
> వనవాసంబున భిక్షులున్ మృగములున్ వర్తింపవే! నీటిలో
> మునుగంజాలవె మత్స్య కచ్ఛపములున్; మోక్షంబదే వీనికిన్
> మనసే మూలము కానొ ముక్తికిని రామా రాజచూడామణీ "

ఇట్టులే ప్రాజ్ఞులవిషయములో గూడ క్షేత్రయాత్రతో పనిలేదని వ్యాసుడు భారతమున :

"తేన చే దవివాద శ్చేన్ మా కాశం మా కురూన్ గమః"

అంతరాత్మతో వివాదము లేకపోయినచో కాశికి వెళ్లకు, కురుక్షేత్రమునకు వెళ్లకు అనిచెప్పెను. ఇది ప్రాజ్ఞుల మాటయని గుర్తించుకొనవలెను. మరియును ఈ గ్రంథము చదువువారి మాటకాదనియును గుర్తించుకొనవలయును.

శ్రీ బులుసు సూర్యప్రకాశ శాస్త్రిగారు అన్నిక్షేత్రములను దర్శించి ఆ క్షేత్రము లందలి వివిధాంశములను ఈ గ్రంథమునందు వర్ణించియున్నారు. ఈ గ్రంథము చదివినచో క్షేత్రదర్శనము చేయకున్నను చేయుచున్నటులే యనిపించును. కావున పాఠకులారా! ఇక చదివిచూడుడు.

చిరివాడ. (కృష్ణా)
20-11-54

శ్రీ వేలూరి శివరామశాస్త్రి
శతావధాని.

పుణ్యక్షేత్రములు

భారతదేశమున భిన్న భాషలు, ఆచారములు కన్పించుచున్నను, ఆధ్యాత్మికవిషయమునకు చెందిన సంప్రదాయము ఒక్కటిమాత్రమే విరాజిల్లినది. నాస్తికులనబడిన వేదబాహ్యులకుగూడ ఈసంప్రదాయము కొంతసోకినది. తద్ద్వారా భారతదేశమున నేమూలలలో జనులు నివసించుచున్నను వారికందరకు నఖండ భారత మనుభావ మనూచానముగా సంక్రమించినది. భారతదేశ మొక్క దేశమే; ఉపనిషత్తులతో పూర్తిగా వికసించి

వైదికసంస్కృతియే భారతీయుల సంప్రదాయసిద్ధమగు సంస్కృతి అను భావములు, విశ్వాసములు మనలో నంతర్లీనముగా నిలచి యున్నవి. ఈ యఖండ భారతమున కేకత్వమును గూర్చుటకే శ్రీ ఆచార్య శంకరభగవత్పాదులు దేశమునకు నాల్గుదిక్కుల యందు నాలుగు పీఠపరంపరల నేర్పరచిరి.

ఈవిధమగు నేకత్వము ప్రతిభారతీయుని నిత్యజీవనమున మూర్తీభవించవలెనన్న, ప్రతివ్యక్తియు దేశమును పూర్తిగా చూడకతప్పదు. కాని కేవల మీాఉద్దేశ్యముతో దేశమును దర్శించగలవారు కొద్దిమందిమాత్రమే యుండగలరు. ఆముష్మిక భావన, ఆధ్యాత్మిక చింతనగల మనదేశీయులకు భారతదేశము ఆధ్యాత్మజగదనుకృతిగా అనాదికాలమునుండి భాసించినది. సర్వత్ర అంతర్యామిగా బ్రహ్మగలడని, వ్యావహారికదశలో అనాది వాసనాభ్రమవశమున బ్రహ్మయే ప్రపంచాకృతితో భాసించు చున్నదనియు విశ్వసించు భారతీయునకు మనదేశములోని ప్రతి స్థలము పూజనీయమైనది. కాని ఆయాసన్నివేశముల ఫలిత ముగా కొన్నిప్రదేశములు మహత్తరములు, మహత్తమములు గూడ నైనవి. భారత, భాగవత, రామాయణ, పురాణముల ద్వారా కొన్నిగ్రామములు, తీరములు, ప్రదేశములు తీర్థక్షేత్ర ములుగా పరిణమించినవి. ఈ పరిణామములో దేశమంతయు పుణ్యక్షేత్రములతో నలంకరింప బడజొచ్చినది. అట్టి పుణ్యస్థల ముల నాశ్రయించుకొని వచ్చినవి తీర్థయాత్రలు.

నదీతీరములు, పర్వతభూములు, లోయలు, మన దేశ ములో పుణ్యక్షేత్రములతో నిండియున్నవి. ఆ యా క్షేత్రము

లలో లభించు జలము మొదలగునవి ఆరోగ్యదాయకము లగుటచేగూడ నివి ముఖ్యప్రదేశము లగుచున్నవి. కాశీ ప్రయాగల లోని గంగాజలము నిర్మలమై కొన్ని రసాయనిక పదార్థములతో నిండియుండుటచే శరీర మాలిన్యమును క్షాలన చేయగల్గుచున్నదని వైజ్ఞానికులు సహిత మను చున్నారు. సాంద్రమగు జలబిందువుల సంయోగము లేనిచో గంగాజలము ఎక్కువ కాలము నిలువయుండక పోవుటచే కాశీనుండి గృహోన్ముఖులగు వారు గోదావరీస్నానముచేసి, గోదావరీజలమును గంగతో కల్పుచున్నారు. స్వచ్ఛమై, తెల్లగానున్న గంగాజలముతో నే విధమైన సంయోగమును పొందక కృష్ణవర్ణమైన యమునాప్రవాహము ప్రక్కప్రక్కనే ప్రవహించును. త్రివేణీసంగమమున నీ రెండుపాయలకు మధ్యగ కొంతదూరము వరకు పసుపురంగుగల చీలిక యొకటి కన్పించును. దీనినే అంతర్వాహినియగు సరస్వతి యందురు. ఈ వైచిత్ర్యము ప్రకృతిసిద్ధమని కొందరు, దైవ నియంత్రితమని ఇతరులు వచింతురు. కాని ఆ వైచిత్ర్యమును స్వయముగా దర్శించువారికి చిత్తవికాసవిస్ఫారము లుదయింపక పోవు. దానిలోగల మాహాత్మ్య మణుమాత్రమైనను మనలో ప్రవేశించి తీరును.

మన కతిసమీపములోగల మంగళగిరికొండపైన పానకము ప్రవహించుచున్నను, ఈగలు కన్పించకపోవుట ఆశ్చర్యకరమే. ఒకానొకప్పుడిది అగ్నిపర్వతమని, అందలి గంధకాది ద్రవ్యములకు పానకము విరుగుడగుటచే నృసింహస్వామికి పానకమును పోయుచున్నారని, దేవతాబుది లేనిచో నిటిది చేయరని,

గంధకమున్నచోట ఈగవ్రాలనేరదని వైజ్ఞానికు లనుచున్నారు. ఇది వాస్తవమైనచో మన తీర్థక్షేత్రములలో కొన్నింటిని వైజ్ఞానిక దృష్ట్యా వ్యాఖ్య చేయవచ్చును.

కాశ్మీరమున శ్రావణపూర్ణిమనాడు యాత్రికులు అమరనాథ దర్శనమునకు బయలుదేరుదురు. శీతబాధను సహించి, కాలినడకపై వెళ్ళి వీరు దర్శించునది ఒకగుహ. ఆగుహలో శిల్పులు చెక్కిన ప్రతిమలులేవు. ఆగుహలోనికి మంచువర్షించును. ఈ మంచు పూర్ణిమనాటికి మూడు లింగాకారములుగ మూడు ప్రక్కల పూర్తిగా కన్పించును. అమావాస్య కీమూర్తులు మాయమగును. వీటినే శివ, పార్వతీ, గణేశులని పిలుతురు. ఇది మహాపుణ్యక్షేత్రము. కేవలము దైవసిద్ధముగా నావిర్భవించు నీమూర్తులను సందర్శించుట మహాభాగ్యము. వైజ్ఞానికులు దీనిని గూడ భౌతికముగా వ్యాఖ్యచేయగల్గినను, ఆధ్యాత్మిక దృష్టిగల ప్రతివ్యక్తికి ఇందొక దివ్యమహిమ కన్పించగలదు. నివేదితాదేవి యనినట్లు సమీపమునుండి దర్శించువారికి హిమాలయములే శివాకృతితో భాసించగలవు. కైలాసశిఖరము భారతీయులకు, బౌద్ధులకుగూడ పుణ్యక్షేత్రమే. ఈహిమాలయములలో పవిత్ర క్షేత్రము లనేకములు గలవు. ఇందలి ప్రకృతిదృశ్యము లద్భుత రసావహములు. వివిధప్రసూనలతలు, భిన్నభిన్నములైన తరులతాగుల్మములు, ఉచ్చావచములైన భూములు, శీతలముగా నున్నను మధ్యమధ్యగల ఉష్ణోదక స్రవంతులుగల హిమాలయములు భారతీయునకు సదా పవిత్రభూములే. కేవలము పర్వత భూముల నధిరోహించుటవలనగూడ అనారోగ్యము సమసి

పోగలదు; మానసము నిర్మలమై, తేలికయై, విస్తృతము కాగలదు. అందలి జలముకూడ మహదుపకారి. కావుననే పూర్వులు పర్వతభూములయందే ఎక్కువగా పుణ్యక్షేత్రములను దర్శించి యున్నారు. వీటిలో నెక్కువగా శక్తిక్షేత్రములు కన్పించుచున్నవి.

శక్తిక్షేత్రములలో ప్రసిద్ధిచెందినది శ్రీశైలము. నిర్జన భూమిలో, కీకారణ్యమధ్యమున, భయంకర జంతువులు స్వేచ్ఛగా విహరించు ప్రదేశమున, అతిలోకసుందరమైన ప్రకృతి రామణీయతలో నీక్షేత్రముగలదు. ఇచటగల భవానీశంకరుల ఆలయములు ఆధ్యాత్మికభావన లేనివారినికూడ నాముష్మిక మార్గములోనికి దింపజాలియున్నవి. కేవలము వీతరాగులే ఇచట తపస్సు చేయగలరని విఖ్యాతి. ఇట్టి భూము లాంధ్రదేశమున చాలగలవు.

మన పుణ్యక్షేత్రములను పరదేశీయులు, మనదేశస్థులు కూడ చాలవరకు తారుమారు చేసినారు. సోమనాథాలయమున నిరాధారముగాగల లింగమును నశింపజేయ దలపెట్టిన మహమ్మదీయుల సంగతి మనకు విశదమే. లింగాయతులు, వైష్ణవులు మార్చివేసిన ఆలయములుగూడ చాల గలవు. తిరుపతిలో గల వేంకటేశ్వరుని నేటి ఔత్తరాహులు సహితము బాలాజీయని పిలుతురు. ఆది ఒకానొకప్పుడు బాలా యను శక్తియొక్క క్షేత్రము. ఇట్లు వైష్ణవత్వము నందిన ఆలయములలో సింహాచలముగూడ నొకటియని సంప్రదాయము. అతిప్రాచీనములైన తీర్థములలోగల ప్రాచీనదేవాలయములు చాలమార్పులను పొందినవి. కొన్నిచోట్ల బౌద్ధుల చైత్యములకుగూడ నిట్టి రూపాంత

రము సంక్రమించినది. పూరీలోని జగన్నాథాలయము వస్తుతః శక్తిక్షేత్రమో, బౌద్ధక్షేత్రమో నేడు చెప్పలేము.

మనదేశమున తీర్థక్షేత్రములను గుర్తించి, వృద్ధిపరచి, ఆలయములను నిర్మించినవారిలో ప్రప్రథములు బౌద్ధులనిగూడ జెప్పవీలున్నది. వైదికసంప్రదాయము ననుసరించువారికి వస్తుతః ఆలయములతో నిమిత్తములేదు. కాని బౌద్ధులు, శాక్తులు నెలకొల్పిన తీర్థక్షేత్రములను భారతీయ సంప్రదాయమున కనుగుణముగా దిద్దిన వారిలో పౌరాణికులను, స్మృతికర్తలను ఎన్నక తప్పదు.

సర్వజనుల నాకర్షింపజాలక తీర్థక్షేత్రములు సౌహార్ద్రమును, సహకరణను, సౌమనస్యమును, ఆధ్యాత్మికవికాసమును చేకూర్పజాలిన వనుటలో నతిశయోక్తి లేదు. ఇట్టి క్షేత్రముల మహాత్మ్యములను, ప్రయోజనములను విశదపరచవలసిన అవసరమున్నది. ఈ యవసరమును గుర్తించి, ప్రజానీకమునకు వీటి విషయమును తెలుప యత్నించుచున్న వారికృషి ప్రశంసనీయము. శ్రీ సూర్యప్రకాశశాస్త్రిగారి యత్న మందరి సానుభూతిని బడయగలదని విశ్వాసము.

జయ శ్రావణము
సాగర్ విశ్వవిద్యాలయము,
సాగర్. (మధ్యప్రదేశము)

పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి
ఎం. ఏ., ఎం. లిట్., పిహెచ్. డి.,

యాత్రలు : తత్ప్రయోజనము

సుప్రసిద్ధుఁడైన యాంగ్లేయ గ్రంథకర్త యొకఁడు యాత్రలు విద్యాభ్యాసమున నొకభాగ మనియు, నవి వినా విద్యాభ్యాస మసంపూర్ణమే యగుననియు నడివియుండెను. గ్రంథపఠనమువలన లభించు జ్ఞానము కేవల సిద్ధాంత ప్రాయమైనది. దేశయాత్ర యా జ్ఞానమున కొకవిధమైన ప్రయోగము వంటిది. గ్రంథలబ్ధమైన జ్ఞానము దేశయాత్రలవలనఁ బరిపుష్టమై యనుభవమునకు వచ్చుటయే కాక మానవునిఁ బ్రపంచజ్ఞాన పరిపూర్ణునిగా నొనరించును. అందుచేతనే పై యాంగ్లగ్రంథకర్త బడిచదువు జనుల నర్ధమానవులఁగా నొనరింప దేశాటనము సమగ్ర మానవులఁగా నొనరించునని వ్రాక్రుచ్చి యుండెను.

మన మిప్పుడు శాస్త్రయుగములో జీవించుచున్నాము. పలురకములైన శాస్త్రీయ నిర్మాణములవలన మానవ జీవిత మిప్పుడు సుఖప్రపూర్ణమై విలసిల్లుచున్నది. పూర్వమువలె దూరము, దగ్గఱ యను భేదము మన కిప్పు డంతగాఁ గాన వచ్చుట లేదు. ఎంతదవ్వుననున్న తావునకైన, నెంత యున్నత మైన ప్రదేశమునకైన మనము ధూమశకటములయు, నౌకలయు, విమానములయు సాహాయ్యముతో నచిరకాలముననే యేగి తిరిగివచ్చుట కిప్పు డవకాశ మున్నది. పూర్వము కాశికేగిన వాఁడు కాటికేగినవాఁడుగా భావింపఁబడుచుండుట యందఱ ఱెఱింగిన విషయమే. కాలినడకనే బహుదూర మరుగవలసివచ్చు టయు, దారినడుమ బాటలులేని దుర్గమారణ్యములను దాఁట వలసివచ్చుటయు నప్పటి వారట్లు భావించుటకుఁ గారణము.